

# పూల సుల్తాన్

"పూల్! మల్లెపూల్!" అని నబీసాహెబు వీధి మొగదల కేక వెయ్యటం తోటే వీధి వీధంతా సంచలిస్తుంది. ఆ కేకతోటే గాలి మల్లెలవాసన మోసుకొస్తుంది. ఆడుకుంటున్న ఆడపిల్లలు ఆట మాని పూలబుట్ట దగ్గరకు పరుగెత్తుకొస్తారు. దొడ్లో పని చేసుకుంటున్న ముత్తయిదువలు పని వొదిలేసి వాకిళ్ళలో కొచ్చేస్తారు.

సాయంవేళ మల్లెలెంత చల్లగా ఉంటాయో, నబీసాహెబు మాటలు అంతకంటె హాయిగా ఉంటాయి. బుట్టమీదికి మూగిన పిల్లల్ని ఆపుతూ "బుల్లెమ్మా ఈ పరికిణీ బాగుందే! సీతాలు చెవులు కుట్టించుకుందే! రత్తమ్మ కొత్త రవిక

తొడిగిందే .... "అంటూ పిల్లల్ని పలకరించి, చెక్కిళ్లు నిమిరి ప్రతి ఇంటిముందుకు వచ్చేవాడు. "సుబ్బమ్మగారూ! పాపకి రేపు పూలజడ వేస్తారా! ఎక్కువ పూలట్టుకొస్తాను" అనేవాడు. వెంకమ్మగారు వంద మల్లె మొగ్గలే కొంటే "బావుందండోయ్! ఇంకో వంద తీసుకోండి. చిన్నమ్మాయిగారికి - లేకపోతే, ఆవిడ నన్ను తిడుతుంది"అంటూ ఇంకో వంద లెక్కపెట్టేవాడు.

అలా ఇంటింటికి పువ్వు లిచ్చుకుంటూ అందర్నీ పలకరిస్తూ ముందుకు సాగేవాడు. పండు ముత్తయిదువలు, మధ్యవయసున్నవాళ్ళు, పడుచు అందగత్తెలు, కొత్త కోడళ్ళు, కన్నె పిల్లలు విచ్చిన కళ్ళతో మల్లెలు చూసుకుంటూ జడల్లో తురుముకోగా వాళ్ళ ముఖాల్లో వెలిగిన దీపాలు, ఆ కొత్త వెలుగు చూసి సంబరపడి పోయేవాడు నబీసాహెబు.

వీధిలో ఆఖరిఇల్లు సీతప్పది. సీతప్ప మల్లెపూల కేకకే ఉలిక్కి పడుతుంది. పువ్వులంటే ఆమెకు పంచ ప్రాణాలు. కిందటేడే పెళ్ళయింది. నుదుటింత పెద్ద బొట్టు. మిలమిల్లాడేకళ్ళు.జడలో మల్లెపూలు పెట్టుకుంటూ వొళ్ళంతా పులకించిపోయేటంత పువ్వులాంటి మనసు సీతప్పది. నబీసాహెబుకి సీతప్పని చూస్తే సొంత అప్పని చూసినట్లుంటుంది. "అప్పా, రెండు మూరలిస్తాను."

"వద్దు ఓ మూర చాలు" అంది సీతప్ప.

నబీసాహెబు "డబ్బులు అయ్యకాడ తీసుకొంటాలే తీసుకో అప్పా" అంటూ రెండు మూరల దండ కాసిని విడిపూలు కూడా ఇస్తూ "వచ్చే ఏడు పూల జడేసుకుని సూడిదలు చేసుకోవాలప్పా" అంటే సీతప్ప సిగ్గుపడిపోయి విడిపూలు వాసనచూసి దండ జడలో తురుముకుని లోపలి కెళ్ళిపోయింది. సీతప్ప నల్లటి పొడవాటి జడలో మల్లెదండ చంద్రవంకలా మెరిసింది. తృప్తిగా ఇంటిముఖం పట్టిన నబీసాహెబు అనుకున్నాడు. "ఆడపుటక్కి బొట్టూ, పూలే, సూరీడూ, సెంద్రుడు."

గుడిసెలోకి రాగానే "వచ్చావా సర్కార్! " అంది ఫాతిమా. ఫాతిమా భర్తని 'సర్కార్!' అంటుంది. నబీసాహెబు భార్యని 'బేగం అని ఆప్యాయంగా పిలుస్తాడు. పదేళ్ళనించి కాపురం చేస్తున్నా వాళ్ళింకా పడుచు జంటే! ఒకే శ్వాస! ఒకే ప్రాణం. భార్యకోసం మిగిల్చిన పూలు ఫాతిమా దోసిట్లో పోశాడు నబీ. క్షణాల్లో దండ గుచ్చుకుని తల్లో తురుముకుని భర్తకెదురుగా కూర్చుంది, పూలుపెట్టుకున్న భార్య ఎదురుగా కూర్చుంటే నబీకి అన్నం, నీళ్ళు అక్కర లేదు. అలాగ వెన్నెట్లో కూర్చున్నారిద్దరూ. వెన్నెలకి మల్లెలు విచ్చుకుంటుంటే, ఫాతిమా చెయ్యి తనచేతిలోకి తీసుకుని చంద్రుణ్ని చుక్కల్ని చూస్తూ పూలపల్లకిలో ఊరేగుతున్న ఆనందం అనుభవించాడు నబీసాయెబు.

మల్లెపూల సీజను అయిపోతే మరి ఆ వూళ్ళో ఉండడు అతను. ఇంకొక వూరు కూలికి వెళ్ళిపోతాడు. మళ్ళీ వసంతవేళ తిరిగి వస్తాడు.

సంవత్సరం తిరిగింది

"పూల్! మల్లెపూల్" మళ్ళీ నబీసాహెబు కేక. మళ్ళీ కేరింతలు కొట్టే పిల్లలు! ముత్తయిదువలు! కన్నె పిల్లలు ! కొత్త కోడళ్ళు! మల్లెపూల కళ్ళు! కొప్పులు! చెక్కిళ్ళ వెలుగు! కుంకుమ కాంతి! మల్లెగాలి! కలకల సువాసన!

వీధి చివరకొచ్చాడు నబీసాహెబు. సీతప్ప వాకిట్లో ఎదురుచూస్తూ నుంచో లేదు. "సీతప్ప కడుపు పండి వుంటుంది. సూడిదలకి పూలజడకి పూలివ్వాలి" అనుకున్నాడు. "పూల్!మల్లెపూల్!" కేకేశాడు. తలుపు తెరుచుకోలేదు. నబీ ఆశ్చర్యపోయాడు. మెట్లెక్కివెళ్ళి తలుపుకొట్టి "మల్లెపూల్" అన్నాడు. సమాధానం రాలేదు. లోపలినుంచి వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు ధ్వనివినిపించింది.

పక్కింటి పార్వతమ్మ చెప్పింది. "నువ్వెళ్ళిపో బాబూ! దానికి పూలెట్టుకొనే యోగ్యత లేదు.. దేవుడు పసుపు కుంకుమ తుడిచేశాడు. వొట్టిమనిషి కూడా కాదు. ఎట్టా బతుకుతుందో" .

నబీసాహెబు కుప్పలా కూలిపోయాడు. కళ్ళు బైర్లు కమ్మాయి. కాళ్లీడ్చుకుంటూ నడుస్తూ "సీతప్పకి బొట్టు లేదా! మల్లెపూలెట్టుకోలేదా!" అనుకుంటూ గుడిసెకొచ్చాడు.

అప్పటికేస్నానం చేసిన ఫాతిమా "సర్కార్! నా పూలేవీ" అనంగానే రెండు దోసిళ్ళ పూలు భార్య చేతిలో మౌనంగా పోశాడు.

వెన్నెట్లో ఇద్దరూ.

ఉన్నట్టుండి నబీ అన్నాడు "నువ్వు బొట్టెట్టుకోవే."

"మన ఆచారం కాదుగా సర్కార్."

"పర్వాలేదు పెట్టుకో.'

పక్కింటికెళ్ళి కుంకుమ తెచ్చి నుదుట పెట్టుకుంది. వెన్నెట్లో మెరుస్తున్న ఆ బొట్టు చూస్తూ.'నా బేగానికి కూడా పూలు పెట్టుకునే రాత పోతేనో ....' అనుకున్నాడు నబీ. ఎవరో ఛళ్ళున చరిచినట్లయింది. గుండె జారిపోయింది. కళ్ళు ధారలవుతున్నాయి. తనకి పూలు ప్రాణం. ఆడదానికి పూలే కళ్ళు, అది లేకుండా నా బేగం ....

ఫాతిమాని దగ్గరికి తీసుకున్నాడు. కౌగలించుకున్నాడు. ఆ శరీరం, ఆ వాసన, ఆ పూలు అవి అతని గుండె చప్పుళ్ళు. ఫాతిమాని దగ్గరకి హత్తుకున్నాడు. దగ్గరగా .... మరింత దగ్గరగా..... ఆ కౌగిలింత విడిపోకూడదన్నట్టు - నబీ సాహెబు మరి లేవలేదు!

ఆ మర్నాడూ ఆ వూరి ముత్తయిదువలకు పిలిచి పూలిచ్చినవాళ్ళు లేరు.

ఫాతిమా ముఖాన చెదిరిన రక్తకుంకుమ!

జడనిండా వాడివత్తలై రాలిన మల్లెలు!*